క్లుప్తంగా

రేపటి నుంచి గంగమ్మ తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని పగడాలపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీగంగమ్మ అమ్మవారి తిరునాల ఉత్సవాలు మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు వంటి నిర్వహిస్తామన్నారు. అలాగే ఆలయ అవరణలో కోలాటం, అన్నదానం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

వర్షం కోసం యాగం



యాగం చేస్తున్న దృశ్యం

తొండూరు : మండల పరిధిలోని ఇనగనూరు గ్రామంలో శ్రీ ఎరుకుల నాంచారమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ ఇనగనూరు ఎంపీటీసీ యాడికి సావిత్రమ్మ, ప్రధాన కార్యదర్శి దశరధరామిరెడ్డిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఈఏడాది వానలు బాగా పడాలని ఆలయంలో యాగం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఉరుసు



ప్రార్థనలు చేస్తున్న కాల్‌టెక్స్ కుటుంబ సభ్యులు

కడప కార్పొరేషన్: కడప నగరం రహమతుల్లా వీధిలో వెలసిన హజరత్ ఖాజా బందే నవాజ్ చాంద్‌పిరి గుమ్మద్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో కాల్‌టెక్స్ కుటుంబ సభ్యులు హబీబుల్లా, హఫీజుల్లా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం కుష్తి రుటీ వద్దా ఫాతేహ చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇనాయతుల్లా, మాజీ కౌన్సిలర్ ఆర్కేరాయల్, మక్బూల్ బాషా తదితరులు పాల్గొన్నారు.


నేడు చిన్నక్క, పెద్దక్క అమ్మవార్ల జాతర



ఆలయంలో కొలువైన అమ్మవార్ల మూలవిరాట్

సుండుపల్లె : మండల కేంద్రంలోని మడితాడు గ్రామ పంచాయతీలో వెలసిన చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ తల్లుల జాతరను పార్టీలకు, కుల మతాలకు అతీతంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఉదయాన్నే పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అమ్మవార్లను అందంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం అభిషేకాలు, బోనాలు, రాత్రికి విద్యుత్ దీపాలంకరణతో, మేళతాళాలతో, చెక్కభజనలతో, చాందినీబండ్ల నడుమ జాతర జరుపుతున్నట్లు వారు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

ఆంజనేయస్వామికి పూజలు



అలంకారంలో అభయాంజనేయస్వామి

పుల్లంపేట : మండలంలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఎర్రదొడ్డి గంగమ్మ జాతర



లింగాల : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చెన్నూరు ఊరేగింపులో కర్రసాము విన్యాసాలు

లింగాల : మండలంలోని అంకేవానిపల్లె గ్రామంలో వెలసిన ఎర్రదొడ్డి గంగమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 14 సంవత్సరాలు తర్వాత జాతరను గ్రామ ప్రజలందరు కలిసి ఘనంగా నిర్వహించారు. జాతరలో లింగాల మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అభిషేక్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మండలంలోని వైఎస్సాఆర్ సీపీ నాయకలు పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా ముగిసిన ఎల్లమ్మ జాతర

చెన్నూరు : చెన్నూరుకు కిలోమీటర్ దూరంలో ఉన్న ఎల్లమాంబ గుడిలో ఆదివారం జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం చెన్నూరు పోలయ్యగారి వీధి నుంచి ఎల్లమ్మ సోదరుడైన పోతులూరయ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని రెడ్డివారి వీధి, బ్రాహ్మణ వీధి, పార్కు వీధి, బస్టాండ్ మెయిన్ రోడ్డు, రెవిన్యూ కార్యాలయం, పోలీ స్‌స్టేషన్ మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగించారు. కర్ర సాములు, కత్తి సాములు చేసుకుంటూ డప్పుల మధ్య చిందులు వేస్తూ ఊరేగింపు కొనసాగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ షరీఫ్, సీఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : చల్లగా చూడాలి తల్లీ అంటూ మండలంలోని తలపనూరు గంగమ్మ, అనిమెల బోగాదమ్మ, ఉరుటూరు చౌడమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లను పట్టు వస్త్రాలు, నిమ్మకాయలతో అలంకరించారు. అనిమెల కోరుకొండపై వెలసిన బోగాదమ్మతల్లిని దర్శించుకునేందుకు మండల ప్రజలే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అచ్చవెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మతల్లిగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. అమ్మవారిని దర్శించు కోవడానికి కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకుంటారు. ఆలయ అర్చకులు భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి–కొత్తపేట సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు చన్నీటి స్నానాన్ని ఆచరించి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో అలంకరించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పచ్చని చెట్ల మధ్య విందు భోజనాలను ఆరగించారు. ఆలయ ఆవరణలోని సాయిబాబా, వైద్యనాథీశ్వరుడు, అక్కదేవతలు, నవగ్రహాలు, వీరభద్రుడు, ఆంజనేయస్వామిలకు పూజలు నిర్వహించారు.



చెన్నూరులో పోతులూరయ్యస్వామి ఊరేగింపు



వీఎన్‌పల్లె : ప్రత్యేక అలంకరణలో అనిమెల బోగాదమ్మ



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

యల్లమ్మకు బోనాల సమర్పణ

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన జగజ్జనని శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల మహోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మాచుపల్లె గ్రామంలోని మహిళలు బోనాలను పట్టుకొని అమ్మవారి గుడికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించి, కాయాకర్పూరాలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరి కొందరు కోడిపుంజులు, జంతు బలులు ఇచ్చి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు కడపకు చెందిన జరుగు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మురిపించిన మువ్వల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు కావడంతో నగరవాసులు ఎండల్లో ఆటవిడుపుగా సాయంత్రం చల్లగాలిని ఆస్వాదించేందుకు కుటుంబాలతో తరలివచ్చారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. బద్వేలుకు చెందిన అనూష డ్యాన్స్ అకాడమి చిన్నారులు ఈ సందర్భంగా పలు సరికొత్త గీతాలకు నృత్యాలు ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. వారు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. శిల్పారామం రాష్ట్ర ఏఓ మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మట్టి మాఫియా చేస్తున్నారనడం బాధాకరం



ఎంపీటీసీ భారతి

వేంపల్లె : పది రోజులుగా ఒక మహిళ వేంపల్లి పరిసర ప్రాంతాల్లో మట్టి మాఫియా చేస్తున్నారని బీజేపీ నాయకులు అనడం చాలా బాధాకరంగా ఉందని ఎంపీటీసీ భారతి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డితో పాటు వారి నాయకులు ఎటువంటి ఆధారాలు లేకుండా వేంపల్లిలో మట్టి మాఫియా చేస్తున్నారనడం విడ్డూరంగా ఉందన్నారు. గత గురువారం గ్రావెల్‌కు సంబంధించి లీజు ఆర్డర్ ప్రకారం తమకు సంబంధిత అధికారులు కొలతలు వేయడం జరిగిందన్నారు. అయితే బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి గ్రావెల్‌కు సంబంధించి లీజ్ ఆర్డర్ లేనిచోటకు వెళ్లి వేంపల్లి మట్టి మహారాణి విచ్చలవిడిగా మాఫియా చేస్తోందనడం సిగ్గుచేటు అన్నారు. వాళ్ల నాయకులు అక్రమంగా మట్టిని తోలుతుంటే అది వారికి కళ్ళకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. తమకు లీజు ఆర్డర్ ఉండి అధికారుల అనుమతితో నాకు ఉండే పరిధిలోనే మట్టిని తోలుకోవడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా ఎంపీటీసీ అని ప్రతి రోజు ఏదో ఒక విధంగా పత్రికల్లో ప్రస్తావిస్తూ మానసికంగా హింసిస్తున్నారన్నారు. ఈ విషయం మీద నేను ఒక మహిళగా దిశ చట్టాన్ని ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. రాజన్న బిడ్డ మీద ఉన్న అభిమానం గౌరవంతో నా చేతి పైన వైఎస్ జగన్, వైఎస్ షర్మిల అని పచ్చబొట్టు వేయించుకుంటే వారి పేరు చెప్పి బెదిరిస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దాదాపు 8 సంవత్సరాల క్రితం వేయించుకున్న పచ్చబొట్టు ఇప్పుడు గుర్తుకు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఏదైనా మాట్లాడేటప్పుడు నిజా నిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు.

జూన్ 6 వరకు బాణా సంచాలు అమ్మకూడదు



బాణా సంచా వ్యాపారస్తులతో మాట్లాడుతున్న సీఐ శంకరరెడ్డి

పులివెందుల రూరల్ : మండల వ్యాప్తంగా బాణా సంచాలు ఎవరు కూడా జూన్ 6వ తేదీ వరకు విక్రయాలు జరపకూడదని పులివెందుల అర్బన్ సీఐ శంకరరెడ్డి తెలిపారు.

ఆదివారం రాత్రి పట్టణంలోని బాణా సంచాలు విక్రయాలు జరిపే దుకాణాదారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాణా సంచాలు అమ్మకుండా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైన విక్రయాలు జరిపినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దుకాణాదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. వ్యాపారస్థులు పోలీసులకు సహకరించాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



చర్చ్ ఆఫ్ గాడ్ సభ్యులతో మెడికల్ సూపరింటెండెంట్ డా. జీవీ రమాదేవి తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్) ఐపీ విభాగంలో బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.1466వ వరల్డ్ వైడ్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ నేతృత్వంలో సంఘ సభ్యులు, 40 మంది యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి మెడికల్ సూపరింటెండెంట్ డా. జీవీ రమాదేవి, ఆర్ఎంఓ డా. వై.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది మాధురి లత, శ్రీకాంత్, వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆర్గనైజర్ జి.ఎబినేజర్ పాల్గొన్నారు.

కేజీ పీజీ సెట్– 2కే24 ఫలితాలు విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న కందుల రాజేశ్వరి, కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కందుల విద్యాసంస్థల్లో ఇటీవల ఎంబీఏ అడ్మిషన్ల కోసం నిర్వహించిన కేజీ పీజీ సెట్ – 2కే24 ఫలితాలను కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కేజీ పీజీ సెట్‌ను తమ విద్యా సంస్థల్లో నిర్వహించడం ఇది రెండవసారి అని తెలిపారు. ఈ పరీక్షల్లో 169 మంది విద్యార్థులు హాజరుకాగా ఇందులో 159 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. వీరిలో మొదటి ర్యాంకు సాధించిన వారికి తమ కళాశాలలో ఉచిత విద్యతో పాటు వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌ప్రసాద్, కేఎస్ఎం ప్రిన్సిపాల్ నాగమణి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

రాయచోటి టౌన్ : మానవత సంస్థ సేవలను విస్తృతపరచడానికి దాతలు అందించిన సహకారం మరువలేనిదని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం సెక్రటరీ వెంకటరమణ, ఉపాధ్యక్షులు సంచుల ఖాదర్ బాషాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ పరిధిలో విద్యార్థులను, రైతులను, ప్రతిభావంతులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలతోపాటు అంబులెన్స్, వైకుంఠ యాత్ర వాహనం వంటి అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి దాతలు అందిస్తోందన్న సహకారం ఎంతో విలువైందన్నారు. అలాగే విద్యార్థులలో నైతిక విలువలు నేర్పడంతోపాటు ప్రకృతిని కాపాడే ప్రయత్నంలో భాగంగా మొక్కలు పెంచడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతికాలు



నృత్యప్రదర్శనలో నృత్య కళాకారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించారు. కడప జిల్లా కిషోర్ డ్యాన్స్ అకాడమి మాస్టర్ కిషోర్ కళా బృందం చిన్నారులచే జానపద, శాస్త్రీయ నృత్యాలతోపాటు సినీ గీతాలకు నృత్యాలు నిర్వహించి సందర్శకులను ఆనందింపజేశారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మృతి



భాస్కర్‌శెట్టి

పులివెందుల రూరల్ : పులివెందుల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భాస్కరశెట్టి (75) మృతి చెందారు. స్థానిక చెన్నారెడ్డి కాలనీలో నివసిస్తున్న ఆయన పులివెందుల జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా 40 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం రాత్రి అస్వ స్తతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పులివెందులలో న్యాయవాదులు ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు.

పోలీసు శాఖకు సహకరించాలి



రాజకీయ నేతలతో మాట్లాడుతున్న నోడల్ డీఎస్పీ సుధాకర్

వల్లూరు : జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని కమలాపురం నియోజకవర్గ నోడల్ డీఎస్పీ ఎస్.సుధాకర్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. కౌంటింగ్‌కు ముందు రోజైన 3వ తేదీన మండల పరిధిలోని ఫంక్షన్ హాళ్లను మూసి వేయాలని, ఇళ్లలో బస చేసిన ఇతర ప్రాంతాలకు చెందిన వారు వారి స్వంతం ఊర్లకు వెళ్లిపోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి స్థానికేతరులకు తమ ఫంక్షన్ హాల్లలో, ఇళ్లలో ఆశ్రయం కల్పించినట్లు తెలిస్తే ఆయా యాజమాన్యాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 4న మండలంలోని అన్ని హోటళ్లను మూసివేయాలని ఆదేశించారు. మెడికల్ ఎమర్జెన్సీ మినహా ఇతర దుకాణాలు తెరవరాదన్నారు. మండలంలో 144 సెక్షన్‌తో పాటు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మానవత ద్వారా మరింత చేయూత



ఫారెస్టు బీట్ అధికారి మధును సత్కరిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సమాజంలో ఉన్న అభాగ్యులకు, నిస్సహాయులకు మరింత చేయూత లభించడం హర్షణీయమని ఫారెస్టు బీట్ అధికారి ఏ. మధు తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మాసాంతర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి తరంలో ఎంతోమంది నిస్సహాయస్థితిలో ఉన్నారని, అనాథలుగా బతుకుతున్నారని, వారికి మేము సైతం అంటూ మానవత అండగా నిలుస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగిండాలన్నారు. మానవ సేవే మాధవ సేవగా నమ్మిన సేవకులంతా ఆదర్శంగా ముందుకెళ్లి.. భావితరాలకు మార్గదర్శకులు కావాలని కోరారు. అలాగే మానవత ద్వారా అందుతున్న వివిధ సేవ కార్యక్రమాలు ప్రశంసనియమన్నారు. భవిష్యత్తులో కూడా అదేతరహాగా సేవా కార్యక్రమాలు అందించాలని కోరారు. అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు చల్లా బాలాజీ, డైరెక్టర్లు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, అనిల్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి శ్రావణ్ కుమార్, ఆయా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తొగట వీర క్షత్రియ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కడప కల్చరల్ : ప్రతిభగల తొగట వీర క్షత్రియ విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. 2023–2024 సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన తొగట వీర క్షత్రియ విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభకు »పట్టాభిషేకం« పేరిట ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కల్యా సుధాకర్, కోశాధికారి టేకూరి సుదర్శన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షులు సుంకర రామచంద్రుడు, కార్యనిర్వహణ కార్యదర్శి పల్లా మురళి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చౌడం సూర్యనారాయణలు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి వారిలో నూతనోత్సాహాన్ని కల్పించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 520 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారికి నగదు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కడప నగరంలోని ప్రైవేట్ పాఠశాలలో చదివి 500 పైబడి మార్కులు వచ్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. జూన్ 23న ఆదివారం ఉదయం 10 గంటలకు కడపలోని వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలను అందజేస్తామన్నారు. పదవ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటో సైజ్ ఫొటోలు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను జూన్ 9వ తేదీ లోపు కల్యా సుధాకర్, డోర్ నెంబర్ 1/1376, శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం ఎదురుగా, బియ్యం అంగడి, ఎర్రముక్కపల్లి, కడప చిరునామాకు పంపాలని సూచించారు.

జీవితం నదీ ప్రవాహం లాంటిది

- సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నెలనెలా సీమ సాహిత్యంపై సదస్సు
- రాయలసీమ నదీ సాహిత్యంపై చర్చ



మాట్లాడుతున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి

కడప కల్చరల్ : ఎన్నో మలుపులతో నదీమ తల్లి గమ్యానికి చేరుకుంటుందని, జీవితం కూడా ఎన్నో మలుపులు, మిట్ట పల్లాలను దాటుకుని జీవిత గమ్యానికి చేరుకుంటుందని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 132వ సదస్సు నిర్వహించారు. 'రాయలసీమ నదీ సాహిత్యం' అనే అంశంపై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నది పరీవాహక ప్రాంతాల భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థికాంశాలతో కూడిన మనిషి జీవిత చిత్రణే నదీ సాహిత్యమన్నారు. విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట', పి.రామకృష్ణారెడ్డి 'పెన్నేటి కథలు'లోని నదీ సాహిత్యాన్ని విశ్లేషించారు. పెన్నేటి పాట చిన్న కావ్యమైనా ప్రాంతీయ అస్తిత్వం దిశగా తెలుగు సాహిత్యంలో చైతన్యం నింపిందన్నారు. అది తర్వాత రచయితలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని గుర్తుచేశారు. రాయలసీమ రైతు కన్నీటిగాథను కరుణ రసాత్మకంగా విద్వాన్ విశ్వం చిత్రించారని కొనియాడారు.

ప్రాంతీయ భాషకు పట్టం

ప్రాంతీయ భాషకు పట్టం కడుతూ పెన్నానది ప్రవహించినప్పుడు ఆనందాన్ని, ఎండినప్పుడు దు:ఖాన్ని మిగిల్చిన జ్ఞాపకాలకు అక్షరరూపాన్ని ఇవ్వడం విశేషమన్నారు. పెన్నేటి కథల రచయిత రామకృష్ణారెడ్డి పోట్లదుర్తి వద్ద పెన్నా ఒడ్డునగల హనుమనగుత్తి గ్రామ వాసి తెలిపారు. వ్యవసాయం తీరు తెన్నులు, రైతులు కూలీలుగా మారి వలస పోవడం, అతివృష్టి, అనావృష్టితో పంట నష్టపోవడం, పశువులకు, రైతులకుమధ్యఆత్మీయ అనుబంధాన్ని ఆయన తన కథల్లో చిత్రించారని కొన్ని కథలను ఉదహరించారు. పాలగిరి విశ్వప్రసాదరెడ్డి రచన 'చుక్క పొడిచింది', శాంతి నారాయణ రాసిన 'పెన్నేటి మలుపులు', డాక్టర్ వేంపల్లి గంగాధర్ రచన 'పాపాగ్ని కథలు', బత్తుల ప్రసాద్ 'సగిలేటి కథలు' తదితర రచనలను పెన్నాన దీ సాహిత్యంలో అంతర్భాగంగా చెప్పవచ్చన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త డాక్టర్ చింతకుంట శివారెడ్డిని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, సాహితీవేత్తలు సన్మానించారు. యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, గానుగపెంట హనుమంతరావు, పుత్తా పుల్లారెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు, రాజారెడ్డి, రమణారెడ్డి, డాక్టర్ సాయిప్రసాద్, చంద్రశేఖర రెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, నారాయణ రెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, బాలయల్లారెడ్డి, స్వరూపరాణి, రామమోహన్ రెడ్డి ,రెడ్డయ్య, గంగయ్య పాల్గొన్నారు.